## క్లుప్తంగా

### జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మతో సీఈఓ భేటీ



జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

**ఒంగోలు సిటీ:** జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను చీమకుర్తిలోని వారి నివాసంలో జెడ్పీ సీఈఓ బి. చిరంజీవి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

### రక్తదాతలకు సత్కారం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

**ఒంగోలు టౌన్:** జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద గల రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో పలువురిని సత్కరించారు. నగరానికి చెందిన 19 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థి బి. మహేశ్వరరెడ్డి గత ఏడాది నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్నాడు. అతనితో పాటు ఎప్పుడు ఎవరికి ఆపద వచ్చినా ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్న నగరానికి చెందిన ఆర్ఎస్ శ్రీనివాసరావును మంగళవారం రెడ్ క్రాస్ భవనంలో ఘనంగా సత్కరించారు. శ్రీ హర్షిణి విద్యార్థులు రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ, వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ పనిముట్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**మద్దిపాడు:** మండలంలో సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు, ఎరువులు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రమేష్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని దొడ్డవరంలో రైతులకు పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకుని వీఏఏల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అదేవిధంగా ఎరువులు కావాల్సిన వారు కూడా ఏయే ఎరువులు కావాలో తెలుపుతూ వీఏఏల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆయన గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంటలో గుళికలు వేయాలని, దీంతో కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చని తెలిపారు. కందిలో వేరు పురుగు రాకుండా నివారించుకునేందుకు వేప కషాయం చల్లుకోవాలని, సేంద్రియ ఎరువులు వాడుకోవాలని సలహా ఇచ్చారు. పొగాకు రైతులు వేసిన పొగనారును ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ పి.శేషయ్య, వీఏఏలు స్పందన, శిరీష, దొడ్డవరం, గార్లపాడు రైతులు పాల్గొన్నారు.

### లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినశిక్ష

**ఒంగోలు టౌన్:** స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని, ఒకవేళ ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిస్తే చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు హెచ్చరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు మంగళవారం నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని తప్పకుండా అమలు పరచాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ వివరాలు రిజిస్ట్రేషన్ తో సరిపోవాలని చెప్పారు. స్కానింగ్ గది తోపాటుగా రిసెప్షన్ గదిలో కూడా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందరికీ కనిపించేలా ఉంచాలన్నారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్, సీటీ స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగులు, పరికరాలను ఉపయోగించే వైద్యుల పేర్లను కూడా ప్రదర్శించాలన్నారు. జిల్లా మాస్ ఉప అధికారి సరోజిని ఈ పరిశీలనలో పాల్గొన్నారు.

# ప్రజలను చైతన్యం చేయడంలో జేవీవీ కృషి



బహుమతులు అందిస్తున్న బదరీనారాయణ, డాక్టర్ జవహర్



గుండ్లాపల్లి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్న జేవీవీ సభ్యులు

**చీమకుర్తి:** మూఢ నమ్మకాలను తొలగించి ప్రజలను చైతన్యం చేయడంలో జన విజ్ఞాన వేదిక 30 ఏళ్లుగా కృషి చేస్తోందని జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ అన్నారు. మంగళవారం చీమకుర్తి గురుకుల బాలికల కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లోని శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచటంలో తోడ్పడుతుందన్నారు. అనంతరం మండల స్థాయిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్ల నుంచి 8,9,10 తరగతులకు సంబంధించిన విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పోటీల్లో ప్రభుత్వ విభాగంలో చీమకుర్తి గురుకుల బాలికల పాఠశాల, గోనుగుంట, పల్లామల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. ప్రైవేటు విభాగంలో సీపీఎస్, విజ్ఞాన్, గౌతమ్ కాన్సెప్ట్ స్కూళ్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. విజేతలకు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ, నూనె హేమసుందర్ బహుమతులు అందించారు. చీమకుర్తి సీవి విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు అందించారు. ఎంఈఓ కె.శివాజీ, జేవీవీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

**నాగులుప్పలపాడు:** మండల కేంద్రం నాగులుప్పలపాడు విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎం. మాలకొండయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారి మెదడుకు పదును పెట్టేందుకు ఈ టాలెంట్ టెస్టు ఎంతో దోహదపడుతుందన్నారు. టాలెంట్ టెస్టులో మొత్తం 7 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా ఉప్పుగుండూరు ఆక్స్‌ఫర్డు హైస్కూల్ ప్రథమ స్థానం, మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించారు. తొలుత టెస్టుకు సంబంధించి పత్రాలు ఆవిష్కరించారు. ఎంఈఓలు రవి, రమణయ్య, పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

**చెకుముకి పోటీల్లో గుండ్లాపల్లి విద్యార్థుల ప్రతిభ**

**మద్దిపాడు:** మండల కేంద్రం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. పోటీల్లో గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ తనీష్, షేక్ కరిష్మ, డి.నిహారికలు ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి జన విజ్ఞాన వేదిక సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డిలు బహుమతి ప్రదానం చేసి సర్టిఫికెట్లు అందించారు.

**చెకుముకి విజేతలకు బహుమతులు**

**కొత్తపట్నం:** మండల స్థాయి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షకు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు మన్నెం శ్రీదేవి తెలిపారు. స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కొత్తపట్నం, అల్లూరు, ఆలూరు, ఈతముక్కల, గమళ్ళపాలెం, మోటుమాల పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు మన్నెం శ్రీదేవి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగే చెకుముకి టాలెంట్ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచిని ప్రశ్నించే తత్వాన్ని శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ మండల స్థాయిలో నిర్వహించిన పరీక్షలో ఈముక్కల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం, కొత్తపట్నం విద్యార్థులు ద్వితీయ స్థానం, ఆలూరు విద్యార్థు తృతీయ స్థానంలో గెలుపొందారు. పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కొత్తపట్నం ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయరాలు కె.ధనలక్ష్మి, యు.శ్రీనివాసన్, జి.నాగేశ్వరరావు, పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ కె.హరిబాబు, శరత్ చంద్ర, జి ఉమామహేశ్వరి, ఈతముక్కల పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కె.లక్ష్మీనారాయణ, ఆలూరు టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు, జేవీవీ సభ్యులు



కొత్తపట్నం: విజయం సాధించిన విద్యార్థులు చూపిస్తున్న సర్టిఫికెట్లు

### నేడు ఒంగోలుకు ఎంపీ మాగుంట

**ఒంగోలు సబర్బన్:** ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి బుధవారం ఒంగోలు రానున్నారు. కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ అండ్ అర్బన్ వ్యవహారాల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన తరువాత మొదటిసారిగా ఒంగోలు వస్తున్నారు.

### విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం ఇస్తున్న కనిగిరి ఏఐఎస్ఎఫ్ నాయకులు

**ఒంగోలు:** కనిగిరి మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యాసంస్థలను నిర్వహిస్తున్నాయని, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కనిగిరి ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరుకుని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు అందించారు. రెండో శనివారం, సెలవు రోజుల్లో కూడా విద్యాసంస్థలను నిర్విరామంగా నిర్వహిస్తున్నారని, ప్రైవేటు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేనప్పటికీ ఇరుకు క్లాస్ రూముల్లో ఎక్కువ మంది శిక్షణ పొందని ఉపాధ్యాయులచే విద్య బోధన చేస్తున్నారన్నారు. విద్యార్థులకు స్వేచ్ఛ లేకుండా, సెలవులు అంటూ తెలియకుండా విద్యా బోధన చేస్తూ బట్టీ చదువులను నిర్వహిస్తున్నారు. స్థానిక ఎంఈఓకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా విద్యాసంస్థలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. మూడో తేదీ నుంచి ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో సెలవు దినాల్లో విద్యాబోధన జరగకుండా విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి సీహెచ్ పవన్ కళ్యాణ్, కనిగిరి పట్టణ నాయకులు గూడూరు సురేష్‌బాబు, రాము, పుట్టా సుబ్బారావు ఉన్నారు.

# పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్



ఒంటరి మహిళకు పింఛను నగదు అందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



పింఛన్ అందిస్తున్న స్పెషలాఫీసర్ అంజల, ఎంపీడీఓ జ్యోతి

**ఒంగోలు సబర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఒంగోలు నగరంలో మంగళవారం పంపిణీ చేశారు. నగరంలోని 15వ డివిజన్ రామ్ నగర్, అన్నవరప్పాడు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి కలెక్టర్ పింఛన్లను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత కింద వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు, ఇతర పింఛనుదారులకు అందజేశారు. అక్టోబర్ నెలకుగాను ఎన్‌టీఆర్ భరోసా పింఛను పంపిణీ ఒకటో తేదీనే ఇస్తున్నామని పేర్కొన్నారు. రామ్ నగర్, అన్నవరప్పాడు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నామన్నారు. నగర మేయర్ జి.సుజాత, కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు, డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్ పాల్గొన్నారు.

**పింఛన్ల పంపిణీని పరిశీలించిన స్పెషలాఫీసర్**

**మద్దిపాడు:** మండలంలోని పెన్షన్ల పంపిణీని మండల స్పెషలాఫీసర్ ఎం. అంజల మంగళవారం పరిశీలించారు. ఈ క్రమంలో ఆమె బసవన్నపాలెం, మద్దిపాడు గ్రామాల్లో పెన్షన్ పంపిణీ జరుగుతున్న తీరు పరిశీలించారు. పంపిణీ వేగవంతం చేయాలని ఆమె ఎంపీడీఓ జ్యోతికి సూచనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీఓ పరిశీలించారు. సీతారాంపురం, బసవన్నపాలెం, మద్దిపాడు, ఏడుగుండ్లపాడు గ్రామాల్లో పెన్షన్ పంచుతున్న విధానాన్ని గమనించారు. ఒక సచివాలయం పరిధిలో కొందరు ఉద్యోగులు సచివాలయం వద్దే ఉండటం గమనించి వారిని గ్రామాల్లో తిరిగి పెన్షన్‌లు పంచాల్సిందిగా చెబుతూ సచివాలయం ఉండవద్దని హెచ్చరించారు. ఏడుగుండ్లపాడులో సర్పంచ్ శిల్పసౌందర్యతో కలిసి వితంతు పెన్షన్ ఒకటి పంపిణీ చేశారు.

# బీజామృతంతో విత్తన శుద్ధి

**కొత్తపట్నం:** బీజామృతంతో విత్తన శుద్ధి చేయటం వలన అధిక దిగుబడులు రావటమే కాక, దాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయం లెవల్‌వన్ అధికారి రెడ్డప్ప అన్నారు. కొత్తపట్నంలో గ్రామ సమైక్య 6లో ప్రకృతి వ్యవసాయం పద్ధతిన వరి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా విత్తనం సంపూర్తిగా మొలకలు రావడం, మొక్క ఎదుగుదల ఉండి పైరు వస్తుందన్నారు. తెగుళ్ళు నివారణ వంటివి ఎదుర్కొంటుందని తెలియజేశారు. పదేళ్ళ నుంచి వీవో 6లో 25 ఎకరాలు ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేయటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ యూనిట్‌ను ఆదారం చేసుకుని మిగత రైతులంతా ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేయాలని కోరారు. విత్తన దశ నుండి కోత దశ వరకు ప్రకృతితో తయారు చేసిన కషాయాలు ఉపయోగించుకోవాలని సూచించారు. వరి పండిన విత్తనాలను పరీక్షలు చేయించి ఆహారం కోసం కొనుగోలు చేసుకోవచ్చున్నారు. మార్కెట్‌లో ఈ ధాన్యానికి అధిక ధర పలుకుతుందని వివరించారు. ఐసీఆర్‌పీ పట్టపు సురేష్, పట్టపు ప్రవీణ్, బద్ధపూడి రాజశేఖర్, పట్టపు సునీత, పత్రా శశి రైతులు ప్రసన్న, పట్టపు భూషణం, ప్రభాకర్, ఆదామ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

### యువతి ఆత్మహత్య

**ఒంగోలు టౌన్:** కుటుంబ కలహాల నేపథ్యంలో నగరానికి చెందిన ఒక యువతి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. నగరంలోని కేశవస్వామిపేటలోని జకరయ్య హాస్పిటల్ సమీపంలో నివశించే గుర్తు తెలియని యువతి మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఒంగోలు నుంచి విజయవాడవైపు వెళ్లే ట్రాక్‌పై రైల్వే స్టేషన్ సమీపంలోని త్రోవగుంట ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైలు కింద పడి దుర్మరణం పాలయింది. యువతి వయసు సుమారు 22 సంవత్సరాలు ఉంటాయి. కాగా ఆమె గుంటూరు జిల్లా పెద కాకానికి చెందిన యువతిగా తెలిసింది.

# కార్యకర్తల సేవలు ప్రశంసనీయం



పారిశుద్ధ్య కార్యకర్తలు, వంట కార్మికులను సన్మానిస్తున్న శ్రీదేవి, వెంకటశేషారావు

**కొత్తపట్నం:** పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యకర్తల సేవలు మర్చిపోలేనివని కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మన్నెం శ్రీదేవి అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కొత్తపట్నం నేతాజీ ట్రూప్ వారిచే స్థానిక హైస్కూల్‌లో మంగళవారం గాంధీ జయంతి సందర్భంగా పారిశుద్ధ్య, వంట కార్మికులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాల పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. పారిశుద్ధ్య కార్యకర్తలు పులిని వెంకటరమణమ్మ, అమృత లక్ష్మి, పట్టపు మరియమ్మ, కోడూరి తిరుపతమ్మ, వంట కార్మికులు బత్తల పద్మ, చోడ ఆదెమ్మ, మార్తమ్మ, కాలేజీ అటెండర్ అంజనేయులను సత్కరించారు. శ్రీదేవి, భారత్ కౌశల్ గైడ్స్ ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకటశేషరావు, డిస్ట్రిక్ ట్రెజరర్ పత్రే వెంకట్రావు, గైడ్స్ టీచర్ పద్మశ్రీ, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ హరిబాబు పాల్గొన్నారు.

### రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

**చీమకుర్తి:** స్థానిక హరిహరక్షేత్రంలో ఈ నెల 3 నుంచి 12 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. దానిలో భాగంగా మొదటి రోజు 3వ తేదీ మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి అంకురార్పణ వేడుకలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని భక్తులందరు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

### మహనీయుల విగ్రహాలకు జలాభిషేకం

**ఒంగోలు సబర్బన్:** స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరంలోని మహనీయుల విగ్రహాలకు మంగళవారం జలాభిషేకాలు చేశారు. ఒంగోలు నగర మేయర్ జి.సుజాత, కమిషనర్ కోడూరు వెంకటేశ్వర రావు ప్రత్యేకంగా ఈ కార్యక్రమాలు చేపట్టారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, పొట్టి శ్రీరాములుతో పాటు మరి కొంతమంది విగ్రహాలకు జలాభిషేకం చేశారు. పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మొక్కలు పర్యావరణ నేస్తాలు



ఒంగోలు పీడీసీసీబీ ఆవరణలో మొక్కలు నాటుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

**ఒంగోలు సిటీ:** పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతుగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జాయింట్ కలెక్టరు/ఆఫీషియల్ పర్సన్-ఇన్ చార్జ్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లాల సహకార కేంద్ర బ్యాంకు ఆవరణలో 'స్వచ్ఛతా హి సేవ' 2024 కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ ఈదా కోటిరెడ్డి, నాబార్డ్ డీడీఎం రవికుమార్, ఆప్కాబ్ నోడల్ అధికారి కె. శ్రీనివాస్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

**కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత**



కారుణ్య నియామక ఉత్తర్వులు అందిస్తున్న గోపాలకృష్ణ

**ఒంగోలు సిటీ:** పీడీసీసీబీ స్టాఫ్ అసిస్టెంట్‌గా టి.భాషితకు కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను జాయింట్ కలెక్టరు రోణంకి గోపాలకృష్ణ మంగళవారం అందజేశారు. మార్కాపురం బ్రాంచి మేనేజరు టి.శ్రీనివాసులు విధి నిర్వహణలో చనిపోవడంతో ఆయన కుటుంబ పోషణ నిమిత్తం కుమార్తె భాషితను ఉద్యోగానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీఈఓ ఈదా కోటిరెడ్డి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

### అసౌకర్యం లేకుండా చూడాలి



జీజీహెచ్ ఎదురుగా చిరువ్యాపారుల బళ్ళను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర రావు

**ఒంగోలు సబర్బన్:** నగరంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడటమే లక్ష్యంగా పనిచేయాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు ఆదేశించారు. మంగళవార ప్లానింగ్ విభాగం, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య అధికారులతో కలిసి పర్యటించారు. రామ్ నగర్ మొదటి లైన్‌లో ఎన్ క్యాప్ నిధులతో నిర్మిస్తున్న జిమ్, పార్కు అభివృద్ధి పనుల గురించి ఏఈని అడిగి తెలుసుకున్నారు. మెయిన్ రోడ్డుపై ఉన్న మట్టి దిబ్బలను, డివైడర్ మధ్యలో ఎండిపోయిన చెట్లను తీసేయాలని ఆదేశించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీ చంద్ ఉన్నారు.

### దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత



**చీమకుర్తి:** స్థానిక భవిత కేంద్రంలో పేరు నమోదైన దివ్యాంగుడు గండి రేవంత్ కుమార్ అనే విద్యార్థికి ఎంఈఓ కె.శివాజీ మంగళవారం వీల్‌చైర్‌ను అందించారు. నడవలేని స్థితిలో ఉన్న విద్యార్థికి వీల్‌చైర్ దోహదపడుతుందని తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు అందించనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

### సత్యాగ్రహ దీక్షకు తరలిరండి

**ఒంగోలు:** స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్షకు మున్సిపల్ టీచర్లు తరలి రావాలని యూటీఎఫ్ నగర శాఖ గౌరవాధ్యక్షుడు చావలి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి బాలరాజు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. ప్రమోషన్లు, పీఎఫ్ ఖాతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హై స్కూల్స్‌లో బోధనేతర సిబ్బందిని తరలించవద్దని హై స్కూల్స్ లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.